కార్మిక, ధార్మిక క్షేత్రాల అభివృద్ధే లక్ష్యం

కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

కలెక్టర్ కార్యాలయంలో జెండా ఎగురవేస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా

రాజన్న సిరిసిల్ల జనవరి 26 (నమస్తే తెలంగాణ) : కార్మిక, ధార్మిక క్షేత్రాల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు పోతున్నామని, సంక్షేమం, అభివృద్ధిలో జిల్లాను అగ్రస్థానంగా నిలిపేందుకు అధికారయంత్రాంగం కృషిచేస్తుందని రాజన్న సిరిసిల్ల కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా స్పష్టం చేశా. 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలను సమీకృత కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పోలీస్ గౌరవ వందనం స్వీకరించిన అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. అనంతరం వివిధ శాఖల్లో సేవలందించిన అధికారులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. గణతంత్ర దినోత్సవ వేడుకలకు హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు, మిడీయా ప్రతినిధులు, ప్రజలకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రసంగం ఆయన మాటల్లోనే.. ''ఆదివారం నుంచి రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్ల పథకాలు అమలు చేస్తూ, నూతన రేషన్ కార్డులు అందజేస్తుంది. నాలుగు విడుతల్లో 44,620 మంది రైతులకు రూ.352.74 కోట్ల రుణ మాఫీ చేశాం. మహాలక్ష్మి పథకం ద్వారా సుమారు కోటి 95 లక్షల మంది మహిళలకు ఉచిత ప్రయాణం ద్వారా రూ.73 కోట్ల 41 లక్షల లబ్ధి చేకూరింది. మూడు ఇందిరామహిళా శక్తి క్యాంటీన్లు ప్రారంభించుకొని, విజయవంతంగా నిర్వహిస్తున్నాం. 93,104 మంది కుటుంబాలకు బ్యాంక్ ఖాతాల్లో రూ.7.35 కోట్ల గ్యాస్ సబ్సిడీ సొమ్ము జమ చేశాం. గృహజ్యోతి పథకం కింద 2024 మార్చి 1 నుంచి 2024 డిసెంబర్ వరకు 9 లక్షల 44 వేల 834 జీరో బిల్లులు జారీ చేసి, విద్యుత్ సంస్థకు రూ.36.36 కోట్లు చెల్లించాం. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ప్రణాళికలు సిద్ధం చేశాం. సీఎం చేతుల మీదుగా అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టాం. జిల్లాలో రూ.900 కోట్లకు పైగా అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపనలు చేశారు. రూ.75 కోట్లతో వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ప్రభుత్వ దవాఖానల్లో వైద్య సహాయాన్ని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాం. చందుర్తి, పెద్ద లింగాపూర్ లో పీహెచ్‌సీలను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తెచ్చాం. ఆరోగ్యశ్రీ ద్వారా 13 వేల 861 మంది రోగులకు రూ.33.63 కోట్ల విలువైన వైద్య సేవలు అందించాం. సిరిసిల్లలోని నేతన్నలకు నేతన్న పొదుపు, నేతన్న భరోసా, నేతన్న భద్రత పథకాలు అమలు చేస్తున్నాం. వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించి క్లాత్ ఆర్డర్, పెండింగ్ బకాయిలు రూ.379.85 కోట్లను చెల్లించాం. 66 లక్షల మీటర్ల ఆర్వీఎం క్లాత్ ఆర్డర్ ఇచ్చాం. రూ.50 కోట్లతో ఏర్పాటు చేసిన యార్న్ బ్యాంక్ విజయవంతంగా కొనసాగుతున్నది. స్వశక్తి సంఘాల్లోని మహిళలకు ఒకే రకమైన 4.56 కోట్ల మీటర్ల చీరల ఉత్పత్తి ఆర్డర్ సిరిసిల్ల నేత పరిశ్రమకు రాష్ట్ర ప్రభుత్వం అందించింది. కాళేశ్వరం ప్రాజెక్ట్ పరిధిలోని ప్యాకేజ్- 9, 10, 11, 12 పనులు పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. కుటుంబ సమగ్ర సర్వేలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 1,531 ఎన్యుమరేషన్ బ్లాక్‌ల పరిధిలో 1,92,432 ఇండ్ల సర్వే సకాలంలో పూర్తి చేశాం. 37 వేల 398 మంది రైతుల నుంచి 2లక్షల 11 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి, రూ.490 కోట్లు చెల్లించాం. 1200ల మంది రైతుల నుంచి 6 వేలకు పైగా మెట్రిక్ టన్నుల సన్న రకం ధాన్యం సేకరించి, రూ.500 బోనస్ చెల్లించాం. కల్లు గీత కార్మికులు ప్రమాదాల బారిన పడకుండా హైదరాబాద్ ఐఐటీ అభివృద్ధి చేసిన కాటమయ్య రక్షా సేఫ్టీ కిట్ గీత కార్మికులందరికీ ఉచితంగా అందజేస్తున్నాం. ఇప్పటికే 400 మందికి కిట్లు అందించాం. 2024-25 సంవత్సరానికి జిల్లాలోని వివిధ మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల పరిధిలోని 440 చెరువుల్లో 70.58 లక్షల చేప పిల్లలను 100 శాతం సబ్సిడీపై లక్ష్యానికి 43.69 లక్షల చేప పిల్లలను నీటిలో విడుదల చేశాం.'' అంటూ జిల్లాలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. వేడుకల్లో విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఎస్పీ అఖిల్ మహాజన్, ఏఎస్పీ చంద్రయ్య, జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

పథకాల కోసం జెండా ఆవిష్కరణ బంద్

రైతు వేదికల ముందు జెండా ఎగురవేయని అధికారులు

జెండా ఆవిష్కరణ లేకుండా ఖాళీగా ఉన్న సుద్దాలలోని రైతు వేదిక

కోనరావుపేట, జనవరి 26: కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన నాలుగు సంక్షేమ పథకాల అమలు కోసం ఏకంగా జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని అధికారులు రద్దు చేశారు. రైతుల సంక్షేమమే తమ ప్రధాన ధ్యేయంగా చెప్పుకుంటున్న ప్రభుత్వం గత ప్రభుత్వం నిర్మించిన రైతు వేదికల ముందు కనీసం జెండా అవిష్కరణ చేయలేదు. దీంతో ఆయా గ్రామాలలోని రైతులు అగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో కోనరావుపేట, నిజామాబాద్, నిమ్మపల్లి, బావుసాయిపేట, సుద్దాల, కొలనూర్ గ్రామాల్లో రైతు వేదికలు ఉండగా, కోనరావుపేట, నిజామాబాద్ రైతు వేదికల ముందు మాత్రమే జెండా అవిష్కరణ చేశారు. మిగితా క్లస్టర్ల పరిధిలో ఏఈవో జెండాను అవిష్కరణ చేయలేదు. గతంలో ఆవిష్కరించామని, ఈసారి అధికారుల ఒత్తిడి, పనిభారం వల్ల జాతీయ జెండా అవిష్కరణ చేయలేదని ఏఈవో సందీప్ తెలిపారు.

లబ్ధిదారుల ఎంపికలో గందరగోళం

అధికారులను నిలదీసిన గ్రామస్తులు

చందుర్తి : ఆందోళన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

చందుర్తి,జనవరి 26: ప్రభుత్వం నాలుగు సంక్షేమ పథకాలను మంజూరు చేయగా, ఆదివారం మండలంలోని కొత్తపేట గ్రామంలో అధికారులు లబ్ధిదారులకు సంక్షేమ పథకాల పత్రాలను అందజేశారు. గ్రామానికి చెందిన పిట్టల ప్రసాద్‌తో పాటు మరి కొంతమంది మహిళలు అర్హులకు బదులు అనర్హులను ఎంపిక చేయడంపై అధికారులను నిలదీశారు. ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో కమిటీలు నిజమైన లబ్ధిదారుల ఎంపికలో అన్యాయం చేశారని అధికారులపై మండిపడ్డారు. ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ భరోసా పథకాలకు కుంటాల సుజాత, ఊరడి కవిత, రామవ్వలతో పాటు పలువురు అర్హులైనప్పటికీ ఎందుకు ఎంపిక చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో మండల ప్రత్యేక అధికారి రవీందర్ రెడ్డి జోక్యం చేసుకొని సంక్షేమ పథకాల పంపిణీ నిరంతర ప్రక్రియని అర్హులందరికీ అందజేస్తామని సర్ది చెప్పారు.

సిరికొండలో గ్రామసభ..

ఇల్లంతకుంట రూరల్, జనవరి 26 : మండలంలోని సిరికొండ గ్రామాన్ని మండలంలో పైలట్ గ్రామంగా ఎంపిక చేసి, అధికారులు ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ భరోసా, కొత్త రేషన్‌కార్డులు, రైతు భరోసా పథకాలకు సంబంధించిన లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలను ఏఎంసీ చైర్మన్ ఐరెడ్డి చైతన్య మహేందర్‌రెడ్డి చేతుల మీదుగా అధికారులు అందజేశారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి రామకృష్ణ, తహసీల్దార్ ఫరూక్, ఎంపీడీవో శశికళ తదితరులు ఉన్నారు.

నాలుగు పథకాలు ప్రారంభం

రుద్రంగి, జనవరి 26 : ప్రభుత్వం అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ భరోసా, కొత్త రేషన్‌కార్డులు నాలుగు పథకాలను నోడల్ అధికారి క్రాంతికుమార్ ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ చెర్మన్ చెలుకల తిరుపతి, అధికారులు, ప్రజాప్రతినిధులు మండలంలోని గైదిగుట్టతండా గ్రామంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గైదిగుట్టతండా గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు 57, రైతు భరోసా 132, కొత్త రేషన్‌కార్డులు 13 మంజూరు చేసినట్లు తెలిపారు. గ్రామంలో అర్హులైన వారికి కొత్త రేషన్ కార్డు మంజూరు కాలేదని, తమ తర్వాత రేషన్ కార్డు ఆప్లై చేసుకున్న వారికి కొత్త రేషన్ కార్డు మంజూరు అయిందని గణేశ్ వాపోయారు. ఇందిరమ్మ ఇండ్లు పంపిణీలో కూడా ఇండ్లు ఉన్నవాళ్లనే ఎంపిక చేశారని పలువురు గ్రామస్తులు వాపోయారు. మార్కెట్ కమిటీ చెర్మన్ చెలుకల తిరుపతి, ఏడీఏ రామారావు, తహసీల్దార్ శ్రీలత, ఎంపీడీవో నటరాజ్, ఎంపీవో సుధాకర్, ఏవో ప్రియదర్శి తదితరులు పాల్గొన్నారు.

చందుర్తి, జనవరి 26 : కొత్తపేట గ్రామంలో నాలుగు నూతన పథకాలను అధికారులు ప్రారంభించారు. గ్రామంలో 5 రేషన్ కార్డులు, 23 మంది పేర్లు నమోదు, 17 మందికి ఇందిరమ్మ గృహాలు, ఆత్మీయ భరోసా పథకం కింద 8 మందికి, రైతు భరోసా 63 మంది లబ్ధిదారులకు 8 లక్షల ప్రొసీడింగ్‌లను అధికారులు అందజేశారు. మండల ప్రత్యేకాధికారి రవీందర్ రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్ , ఎంపీడీవో ప్రదీప్‌కుమార్, ఎస్ఐ అంజయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బొజ్జ మల్లేశం, వ్యవసాయ అధికారి దుర్గారాజు, ఉపాధి హామీ ఏపీవో రాజయ్య, జూనియర్ అసిస్టెంట్ రమాదేవి, ఏపీఎం రజిత తదితరులు ఉన్నారు.

ఎల్లారెడ్డిపేట, జనవరి 26 : మండలంలోని ఒక్క గ్రామానికి ప్రభుత్వ పథకాలు దశల వారీగా ఇస్తున్నట్లు అధికారులు గణతంత్ర దినోత్సవం సందర్భంగా గుండారంలో వెల్లడించారు. ఈ సందర్భంగా రేషన్‌కార్డులు 37 మందికి, ఇందిరమ ఇండ్లు 36 మందికి, ఆత్మీయ భరోసా 92 మందికి, రైతు భరోసా 260 మందికి మొదటి దఫాలో ఇస్తున్నట్లు తెలిపారు. అర్జీ పెట్టుకున్న దాదాపు అందరినీ అర్హులుగా గుర్తించినప్పటికీ మొదటి దఫాలో 36 మందికి ఇస్తున్నట్లు తెల్పడంతో అర్హత ఉన్న మిగతా వారు తమకు ఎప్పటి వరకు ఇస్తారని అధికారులను అడుగగా, దశలవారీగా ఇస్తామని చెప్పడం కొసమెరుపు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి అఫ్జల్ బేగం మాట్లాడుతూ, మొదటి దఫాలో కొందరికి ఇస్తున్నప్పటికీ దశల వారీగా గ్రామంలో అర్హత ఉన్న అందరికీ నాలుగు పథకాలను ఇస్తామని చెప్పారు. ఏఎంసీ చైర్మన్ సాబెరా బేగం, ఎంపీడీవో సత్తయ్య, తహసీల్దారు రాంచందర్, ఏవో కవిత, డీటీ సత్యనారాయణ, ఎంపీవో జోగంరాజు, కార్యదర్శి దేవరాజు, నాయకులు సూడిది రాజేందర్, బానోత్ రాజునాయక్ ఉన్నారు.



ఎల్లారెడ్డిపేట : లబ్ధిదారుకు రైతు భరోసా ప్రొసీడింగ్ ఇస్తున్న అధికారులు

సిరిసిల్ల రూరల్, జనవరి 26 : తంగాలపల్లి మండలం రాళ్లపేటలో ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పథకాల ఎంపికైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. మండలంలో రాళ్లపేట గ్రామాన్ని ఎంపిక చేసి, రైతు భరోసా, రైతు ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వెల్ముల స్వరూప రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శేషాద్రి, తహసీల్దార్ జయంత్ కుమార్, ఏ ఎంసి వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగం గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ఉన్నారు.

కోనరావుపేట, జనవరి 26 : మండలంలోని కొలనూర్ గొల్లపల్లి గ్రామంలో ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాల ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. ఇక్కడ ఆర్డీవో రాజేశ్వర్, తహసీల్దార్ విజయప్రకాశ్‌రావు, ఎంపీడీవో శంకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య పాల్గొన్నారు.

గంభీరావుపేట, జనవరి 26 : మండలంలోని దమ్మన్నపేటలో ఆదివారం ఆయా కొత్త పథకాలను అధికారులు ప్రారంభించి, లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. 670 మందికి రైతు భరోసా, 102 మందికి ఆత్మీయ భరోసా, 169 మందికి ఇందిరమ్మ ఇళ్లు, 34 మందికి రేషన్ కార్డుల ప్రొసీడింగ్‌లను అందించారు. ఏఎంసీ చైర్‌పర్సన్ విజయ, ప్రత్యేకాధికారి రాఘవేందర్, తహసీల్దారు భూపతి పాల్గొన్నారు.

యాసంగి పంటకు నీళ్లందించడానికి కృషి చేస్తాం

ఏఎంసీ చైర్మన్ ఐరెడ్డి చైతన్య మహేందర్‌రెడ్డి

ఇల్లంతకుంట రూరల్, జనవరి 26 : యాసంగి పంటకు అనంతగిరి అన్నపూర్ణ రిజర్వాయర్ ద్వారా నీళ్లందించేందుకు కృషి చేస్తామని ఏఎంసీ చైర్మన్ ఐరెడ్డి చైతన్య మహేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని వల్లంపట్ల బతుకమ్మ చెరువులోకి నీళ్లు వదలడానికి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కృషి చేస్తున్నారని, మండలంలోని రహీంఖాన్‌పేట, అనంతారం, వల్లంపట్ల గ్రామాల్లోని చెరువులను నింపడం జరుగుతుందని, పంటలు ఎండకుండా బిక్కవాగులోకి కూడా నీళ్లు వదిలేలా చర్యలు చేపడతామన్నారు. డీ1కెనాల్‌లో పిచ్చిమొక్కలు, పూడిక మట్టిని తొలగిస్తామని తెలిపారు.

రెండు ట్రాలీ ఆటోలు ఢీ : ఇద్దరికి గాయాలు

చందుర్తి,జనవరి 26: మండల కేంద్రంలోని రాజీవ్ గాంధీ బస్టాండ్ వద్ద రెండు ఆటోలు ఎదురెదురుగా ఢీ కొనడంతో ఇద్దరికీ స్వల్ప గాయాలయ్యాయి. గ్రామస్తుల కథనం ప్రకారం.. సిద్దిపేట చెందిన ట్రాలీ ఆటో కోరుట్లకు వెళ్లి తిరిగి వస్తుండగా, చందుర్తికి చెందిన ట్రాలీ ఆటో మల్యాలకు వెళ్తుండగా, మూలమలుపు వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఆటోలు ధ్వంసం కాగా, డ్రైవర్లకు స్వల్ప గాయాలు అయినట్లు తెలిపారు. ఈ సంఘటనపై విచారణ జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



ప్రొసీడింగ్ పత్రాన్ని అందజేస్తున్న అధికారులు, నాయకులు

వీర్నపల్లి, జనవరి26: ప్రభుత్వం ప్రవేశపెట్టిన 4 రకాల సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సెస్ డైరెక్టర్ మాడ్గుల మల్లేశం అన్నారు. మండలంలోని లాల్‌సింగ్ తండాలో ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సందేశం తెరపై ఏర్పాటు చేశారు. ఆయా పథకాలకు సంబంధించి ఒక్కో కౌంటర్ ఏర్పాటు చేశారు. లిస్ట్‌లో తమ పేరుందా అంటూ పలువురు గ్రామస్తులు అక్కడున్న సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ లెంకల లక్ష్మణ్, ఎమ్మార్వో మారుతిరెడ్డి, ఎంపీడీవో అబ్బుల్ వహిద్, ప్రత్యేకాధికారి రాందాస్, ఏవో జయ, తదితరులు ఉన్నారు.

రాబడి

యూపీఎస్ వచ్చేస్తోంది..

ఏప్రిల్ 1 నుంచి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు అమలు

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యూపీఎస్) అమలును మోదీ సర్కారు ప్రకటించింది. పదవీ విరమణ పొందినవారికి పింఛన్ హామీ, ఆర్థిక భద్రతలే లక్ష్యంగా పాత పెన్షన్ స్కీమ్ (ఓపీఎస్), జాతీయ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్) రెండింటి ప్రయోజనాలను కలగలిపి ఈ యూపీఎస్‌ను కేంద్రం తీసుకొచ్చింది. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఇది అమల్లోకి రానున్నది. అయితే అర్హులైనవారికి ఈ యూపీఎస్ ఎలాంటి పరిస్థితుల్లో వర్తిస్తుందో కూడా ఇందులో పేర్కొన్నారు.

పదవీ విరమణ

కనీసం పదేండ్లు ఎంపిక చేసిన సేవలు అందించి, ఆ తర్వాత రిటైరైన ఉద్యోగులకు యూపీఎస్ వర్తిస్తుంది.

ఎఫ్ఆర్ 56(జే) కింద రిటైర్మెంట్

పెనాల్టీ ప్రొవిజన్స్ కింద కాకుండా రిటైరైన ప్రభుత్వ ఉద్యోగులే అర్హులు.

వాలంటరీ రిటైర్మెంట్

కనీసం 25 ఏండ్లు పనిచేసి, ఆ తర్వాత స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకున్నవారికి రిటైర్మెంట్ వయసు వచ్చాకే పింఛన్.

ఇలాగైతే రాదు..

డిస్మిస్, ఉద్యోగం నుంచి తొలగించిన వారు, రాజీనామా చేసినవారికి యూపీఎస్‌ను ఎంచుకొనే అవకాశం ఉండదు.

యూపీఎస్ ప్రయోజనాలు

- 25 ఏండ్లు లేదా అంతకుమించి క్వాలిఫైయింగ్ సర్వీస్ ఉన్న ఉద్యోగులకు రిటైర్మెంట్‌కు ముందు చివరి 12 నెలలు అందుకున్న వేతనంలోని సగటు బేసిక్ పేలో 50 శాతాన్ని నెల నెలా పింఛన్‌గా అందిస్తారు. సర్వీస్ 25 ఏండ్ల కంటే తక్కువగా ఉంటే పింఛన్ తగ్గుతుంది.
- క్వాలిఫైయింగ్ సర్వీస్‌లో 10 ఏండ్లు, అంతకుమించి ఉన్న ఉద్యోగులకు నెలకు కనీసం రూ.10,000 పింఛన్‌గా చెల్లిస్తారు. 25 ఏండ్లు పనిచేసి వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్నవారికి, పదవీ విరమణ వయసు వచ్చాకే పింఛన్ మొదలవుతుంది.
- పదవీ విరమణ అనంతరం పింఛన్‌దారుడు చనిపోతే.. ఆ పింఛన్‌లో 60 శాతం భార్య లేదా భర్తకి వస్తుంది.
- నిబంధనలకు లోబడి ఉద్యోగులకు డీఏ తరహాలోనే పింఛన్‌దారుడు, వారు లేకపోతే భాగస్వామికి డియర్‌నెస్ రిలీఫ్‌నూ చెల్లిస్తారు. పింఛన్ మొదలైతేనే వస్తుంది.
- అదనంగా పదవీ విరమణ సమయంలో క్వాలిఫైయింగ్ సర్వీస్‌లోని ప్రతీ ఆరు నెలల కాలానికి నెలవారీ బేసిక్ పే, డీఏలో 10 శాతం చొప్పున లెక్కించి ఎన్నేండ్లయితే అన్నేండ్లకు ఒకేసారి చెల్లిస్తారు. ఈ మొత్తం పింఛన్‌లో తగ్గించరు.

ఇలా ట్రై చేద్దామా..!

లో క్యారెట్ గోల్డ్‌కూ డిమాండే

దేశీయంగా బంగారం ధరలు మళ్లీ ఆల్ టైమ్ హైల్లో కదలాడుతున్నాయి. మొన్నటి దాకా తగ్గుముఖం పడుతున్నట్టు కనిపించినా.. తిరిగి పుంజుకున్నాయి. దీంతో చాలా మంది అవసరమైతే తప్ప పసిడి కొనుగోళ్లకు వెళ్లడం లేదు. ఇంకొందరైతే రేట్లు మరింత తగ్గుతాయేమోనని ఎదురుచూస్తూ ఉన్నారు. బహిరంగ మార్కెట్‌లో 24 క్యారెట్ గోల్డ్ 10 గ్రాముల విలువ మునుపెన్నడూ లేనివిధంగా రూ.83,000 దాటేసింది మరి. అయితే సరిగ్గా ఇప్పుడే లో క్యారెట్ గోల్డ్.. కొనుగోలుదారులకు చక్కని ప్రత్యామ్నాయంగా కనిపిస్తున్నది. 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత), 22 క్యారెట్ (99.5 స్వచ్ఛత)లే కాకుండా 18, 14, 10 క్యారెట్ బంగారు ఆభరణాలు కూడా దొరుకుతాయి. నిజానికి ఇప్పుడిప్పుడే ఈ లో క్యారెట్ గోల్డ్‌కూ డిమాండ్ కనిపిస్తుండటం మార్కెట్‌లో మారిన ట్రెండ్‌కు నిదర్శనం.

బడ్జెట్‌కు తగ్గట్టుగా..

కొనుగోలుదారుల అభిరుచికి తగ్గట్టుగా ఇటీవలికాలంలో బడా జ్యుయెల్లర్స్, ప్రముఖ నగల వర్తకులు సైతం 18 క్యారెట్ బంగారు ఆభరణాలను పెద్ద ఎత్తున తయారు చేస్తున్నారు. మరికొన్ని చిన్నచిన్న జ్యుయెల్లర్స్ 14, 10 క్యారెట్ బంగారు నగలనూ తెస్తున్నారు. పైగా భారతీయ మార్కెట్‌లో మెజారిటీ వాటా మిడిల్ క్లాస్ కస్టమర్లదే కావడంతో జ్యుయెల్లర్స్ దృష్టి ఈ లో క్యారెట్ విభాగంపై గట్టిగానే పడుతున్నది. ఇక వీటిలోనూ నచ్చిన, రకరకాల డిజైన్లు ఇప్పుడు లభిస్తుండటం విశేషం. దీంతో ఎగువ మధ్యతరగతి నుంచి దిగువ మధ్యతరగతి వర్గాలదాకా అంతా వీటి కొనుగోళ్లకు ఆసక్తి చూపిస్తున్నారు. ముఖ్యంగా యువత కూడా మక్కువ చూపుతున్నది. అలాగే ధర తక్కువ కావడం, ఆకర్షణీయంగా కూడా ఉండటంతో మార్కెట్‌లో వీటికి నానాటికీ డిమాండ్ పెరుగుతూపోతున్నది. అందరి బడ్జెట్‌కు తగ్గట్టుగా అందుబాటులో ఉంటుండటంతో పెండ్లిళ్లు, ఇతర శుభకార్యాలకూ ఎక్కువగా వీటినే ఎంచుకుంటుండటం ఈ మధ్యకాలంలో పెరిగిందనే చెప్పవచ్చు.

నాణ్యతకు ఢోకా లేదు

22 క్యారెట్ నుంచి 10 క్యారెట్ వరకు ఆయా ఆభరణాల్లో బంగారం వినియోగం తగ్గుతున్నకొద్దీ వెండి, రాగి, జింక్, నికెల్, పల్లాడియం తదితర లోహాల వాటా పెరుగుతుంది. అందుకే వాటి ధరల్లో అంత తేడా. 22 క్యారెట్ బంగారు ఆభరణాల్లో బంగారం వాటా ఎక్కువగా ఉంటుంది కనుక సహజంగా వీటి రేటు అధికం. 24 క్యారెట్ గోల్డ్ రేటుకు దగ్గర్లోనే పలుకుతుంది. నిజానికి స్వచ్ఛమైన బంగారంతో నగలను తయారు చేయలేం. అందుకే వాటిలో ఇతర లోహాలను కొద్దిగానైనా కలుపుతారు. ఇదే క్రమంలో గోల్డ్ క్యారెట్ తగ్గుతున్నకొద్దీ ఇతర లోహాల పరిమాణం పెరుగుతూపోతుంది. అంతమాత్రం చేత నాణ్యతకు ఢోకా ఉండదు. ఇంకా చెప్పాలంటే 22 క్యారెట్ కంటే 18 క్యారెట్ బంగారు ఆభరణాలే గట్టిగా ఉన్నాయని వినియోగదారులు చెప్తుండటం గమనార్హం.

చివరగా..

ధరలు పెరిగాయనో.. డబ్బు సరిపడా లేదనో కాకుండా మీ బడ్జెట్‌లో ఆయా రకాల లో క్యారెట్ నగలను ఆనందంగా కొనేయండి. అయితే మోసాలకు తావు లేకుండా జాగ్రత్తపడటం మాత్రం మరిచిపోవద్దు. అన్ని నాణ్యతా ప్రమాణాలు ఉన్నాయా? లేదా? అన్నది కనుక్కోవడం మంచిది. ఇక వీటిని మళ్లీ అమ్ముకున్నా.. తరుగుపోను అందులోని బంగారానికి అప్పటి రేటు ఎలాగూ లభిస్తుంది. ధర తక్కువైతే అప్పుడు మరింత హై క్యారెట్ బంగారు నగలకు అప్‌గ్రేడ్ అయిపోండి.



రెండేండ్ల క్రితం దేశీయంగా నగల అమ్మకాల్లో 5 నుంచి 7 శాతంగా ఉన్న లో క్యారెట్ గోల్డ్ ఆర్నమెంట్స్ వాటా.. ఇప్పుడు 15% దాటిపోవడం మారిన ట్రెండ్‌కు అద్దం పడుతున్నది.

-సురేంద్ర మెహోతా, భారతీయ బులియన్, జ్యుయెల్లర్స్ సంఘం కార్యదర్శి

తేలికపాటి నగల హవా

ఒకప్పుడు నడుములు వంగిపోయేంతదాకా నగలు ధరించేవారు. భారీ డిజైన్లతో.. తులాలకొద్దీ బంగారాన్ని పెట్టుకునేవారు. కానీ ఇప్పుడు అంతంత బరువైన నగలను వేసుకొనేందుకు సంపన్నులు సైతం ఇష్టపడటం లేదు. దీంతో మార్కెట్‌లో తేలికపాటి బంగారు నగలకే ప్రస్తుతం ఎక్కువగా డిమాండ్ ఉంటున్నదని నగల వ్యాపారులు అంటున్నారు. నగల తయారీలో వచ్చిన కొత్త టెక్నాలజీ.. సంప్రదాయ, భారీ డిజైన్లనూ తక్కువ బంగారాన్ని వినియోగించి స్వల్ప బరువుకే అందుబాటులోకి తెచ్చేలా చేసిందని ప్రపంచ స్వర్ణ మండలి భారతీయ కార్యకలాపాల విభాగం సీఈవో సచిన్ జైన్ చెప్తున్నారు. మొత్తానికి లైట్ వెయిట్.. లో క్యారెట్ గోల్డ్ ఇప్పుడు పసిడి మార్కెట్‌ను శాసిస్తున్నాయనడంలో సందేహం లేదు.

ఇదీ క్యారెట్ కథ..

- **24 క్యారెట్‌లో 99.90 శాతం స్వచ్ఛమైన పుత్తడి ఉంటుంది. దీన్నే మేలిమి బంగారంగా కూడా పిలుస్తారు. కడ్డీలు, బిస్కట్లు, నాణేల రూపంలో అమ్ముతారు.**
- **22 క్యారెట్‌లో 91.67 శాతం స్వచ్ఛత కలిగిన పసిడి లభిస్తుంది. మిగతా 8.33 శాతం (5 శాతం వెండి, 2 శాతం రాగి, 1.33 శాతం జింక్) ఇతర లోహాల మిశ్రమం ఉంటుంది. అత్యుత్తమ శ్రేణి నగల తయారీకి దీన్నే వాడుతారు.**
- **18 క్యారెట్‌లో 75 శాతం ప్యూర్ గోల్డ్ కనిపిస్తుంది. 25 శాతం ఇతర లోహాలే.**
- **14 క్యారెట్‌లో 58.33 శాతం స్వచ్ఛమైన బంగారం. 41.67 శాతం వేర్వేరు లోహాలను కలుపుతారు.**
- **10 క్యారెట్‌లో 41.67 శాతం బంగారం, 58.33 శాతం ఇతర లోహాలు.**



సూచీలకు బడ్జెటే దిక్సూచి

గమనిక..: స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.

మార్కెట్ పల్స్

దేశీయ స్టాక్ మార్కెట్లు రివర్స్‌గేర్‌లోనే నడుస్తున్నాయి. గత వారంలోనూ నిరాశపర్చాయి. ఇన్వెస్టర్లు అమ్మకాల ఒత్తిడిలో ఉండిపోతున్నారు. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే గత వారం బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 428.87 పాయింట్లు లేదా 0.55 శాతం దిగజారి 76,190.46 వద్ద స్థిరపడింది. నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 111 పాయింట్లు లేదా 0.47 శాతం క్షీణించి 23,092.20 దగ్గర ఆగింది. అయితే ఈ వారం బడ్జెట్ అంచనాలు, నిర్ణయాలు.. మార్కెట్లకు దిక్సూచిగా ఉండనున్నాయి. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కొత్త బడ్జెట్‌ను ప్రవేశపెట్టబోతున్నారు. ఇది శనివారమైనప్పటికీ స్టాక్ మార్కెట్లలో ట్రేడింగ్ జరుగనున్నది. సాధారణంగా శని, ఆదివారాలు స్టాక్ మార్కెట్లకు సెలవు అన్న విషయం తెలిసిందే. దీంతో బడ్జెట్‌ను ఇన్వెస్టర్లు మెచ్చితే సూచీలు పైకి, లేకుంటే కిందికి అనుకోవచ్చు. ప్రధానంగా ఆయా రంగాల షేర్లను పన్నులు, ప్రోత్సాహకాలు నడిపిస్తాయని చెప్పవచ్చు. ఆదాయ పన్నుల్లో ఊరట లభిస్తే ఆటో, రియల్టీ, బ్యాంకింగ్ షేర్లకు ఊతమిచ్చినట్టే. అలాకాకున్నా ఇవే ముందుగా ప్రభావితం కావచ్చు. ఇక డాలర్‌తో పోల్చితే ఇంకా ఆమోదయోగ్యం కాని స్థాయిల్లోనే కొట్టుమిట్టాడుతున్న రూపాయి మారకం విలువ.. మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీస్తున్నది. గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, విదేశీ మదుపరుల పెట్టుబడులు, ముడి చమురు ధరలు, అంతర్జాతీయ పరిణామాలూ కీలకమే. కాగా, అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 22,700 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 22,500 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 23,300-23,500 స్థాయికి వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

తపాలా పథకాలు భళా

గరిష్ఠంగా 8.2 శాతం వడ్డీరేటు

తపాలా శాఖ రకరకాల పెట్టుబడి పథకాలను అందిస్తున్నది. ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ), రికరింగ్ డిపాజిట్ (ఆర్‌డీ), మంత్లీ ఇన్‌కమ్ డిపాజిట్ (ఎంఐడీ), సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ (ఎస్‌సీఎస్ఎస్), సుకన్య సమృద్ధి యోజన (ఎస్ఎస్‌వై), నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ (ఎన్ఎస్‌సీ), కిసాన్ వికాస్ పత్ర (కేవీపీ), మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్ (ఎంఎస్ఎస్‌సీ) వంటి చిన్న మొత్తాల పొదుపు పథకాల్లో సురక్షిత పెట్టుబడులకు అవకాశం కల్పిస్తున్నది. అంతేగాక వీటికి వడ్డీరేటు 6.7 శాతం నుంచి 8.2 శాతం వరకు ఉన్నది. ఈ పథకాల ద్వారా ఇతర ప్రయోజనాలూ మదుపరులకు అందుతుండటం విశేషం.

పథకం	వడ్డీ (%)
పోస్టాఫీస్ సేవింగ్స్ అకౌంట్	4.00
ఏడాది, రెండేండ్ల ఎఫ్‌డీ	6.9, 7,
మూడు, ఐదేండ్ల ఎఫ్‌డీ	7.1, 7.5
పోస్టాఫీస్ ఆర్‌డీ	6.70
ఎస్‌సీఎస్ఎస్	8.20
పోస్టాఫీస్ మంత్లీ ఇన్‌కమ్	7.40
నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్	7.70
పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్	7.10
కిసాన్ వికాస్ పత్ర	7.50
మహిళా సమ్మాన్	7.50
సుకన్య సమృద్ధి యోజన	8.20